

# కథా కౌముది

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

## అటానమస్ ఏజంట్

-డా||కె.గీత, Morgan Hill, CA

**అలెక్సా! వాటీజ్ ద వెదర్ టుడే?**

"మంచం మీంచి లేవకుండానే అడిగేడు" అనుపమ్.

"టుడే ఈజ్ మోస్ట్లీ క్లౌడీ.....అండ్ దేరీజ్ ఏ ఫిఫ్టీన్ పర్సెంట్ (15%) ఛాన్స్ ఆఫ్ రైన్ ...ఇన్.........."

"అబ్బా... చలి చంపేస్తోంది.. మధ్య ఈ వానలొకటి.. ఎక్కడా తగ్గకుండా"

పక్కన మరో దిండు వెక్కిరిస్తోంది.

జ్యోత్స్న వెళ్ళిపోయి ఆరునెల్లు కావస్తోంది. తనతోనే వెన్నెలంతా పట్టుకుని వెళ్ళిపోయింది. ఎందుకు తనకి అంత పంతం? ఏం.. మొగుణ్ణి .. నాలుగు మాటలు అనకూడదా!

"అమెరికాలో పిల్లల్ని అమ్మా, బాబూ అని గెడ్డాలు పట్టుకుని బతిమలాడాలిరా. ఏమనడానికీ లేదు, మీరు పిల్లల్ని కనేముందే మీ కోపతాపాల్ని కంట్రోల్ చేసుకోవడం నేర్చుకోండి" గౌతమ్ మాటలు గుర్తుకొచ్చాయి.

"హు.. ఇంకెక్కడి పిల్లలు... ఉన్న ఊళ్ళో ఉద్యోగం పోగానే, మరో ఊళ్ళో ఉద్యోగం వచ్చినపుడు వద్దన్నా వినకుండా వెళ్ళిపోయింది. వెళ్లనీ....నాకేంటి? నేను మగాణ్ణి. తనే నన్ను బతిమలాడాలి" విసుగ్గా తల విదిలించుకుని

"హేయ్ సిరీ... టైం ఎంతైంది?" అన్నాడు షర్టు వేసుకుంటూ.

అట్నుంచి ఏ శబ్దమూ వినపళ్ళేదు.

ఇదొకటి దిక్కుమాలింది. ఒక్కోసారి ఉలకదు, పలకదు. "హేయ్ సిరీ...ఓయ్ సిరీ..."

ఊ... అని విసుక్కుంటూ ఆపిల్ వాచీలో అప్పుడే వచ్చిన నోటిఫికేషన్ చూసుకున్నాడు.

“అమ్మ బాబోయ్, మరో గంటలో మీటింగుంది కదూ... ఇప్పుడు కార్లో కూచున్నా ట్రాఫిక్ లో పడి ఎప్పటికి వెళ్తానో...అసలే గౌతమ్ ఇవేళ వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ కార్ పూల్ కి రావడం లేదు. కార్ పూల్ లేకపోతే జనరల్ లైన్లలో వెళ్లడం ఒక్కటే గతి. ఫాస్ట్ పాస్ లైన్లు ఈ రూటుకి ఎప్పుడేస్తారో ఏమో! జనరల్ లైనుల్లో డ్రైవ్ సమయానికి తెములుతుందో లేదో...”

గబగబా పరుగెత్తి టెస్లా లో కూచున్నాడు. ఫుల్లీ ఆటోమేటిక్ డ్రైవ్ మోడ్ లో పెట్టి యూట్యూబ్ లో లేటెస్ట్ టెక్ వీడియో ఆన్ చేసి డాష్ బోర్డు కింద పెట్టాడు.

నోట్లో సగం కుక్కుకున్న బ్రెడ్ మెల్లగా మింగుతూ, టు గో కప్పులో మిగిలిపోయిన నిన్నటి స్టార్ బక్స్ బ్లాక్ కాఫీని కాస్తగా సిప్ చేస్తూ “హమ్మయ్య... ట్రాఫిక్ కాస్త లైట్ గానే ఉన్నట్టుంది. మరీ రక్త సింధూరంలా లేకుండా అక్కడక్కడా పసుపు ముగ్గేసినట్టు ఉంది అనుకున్నాడు ఎదురుగా కారు స్క్రీన్ మీద మేప్ లోని ట్రాఫిక్ గీత వైపు చూస్తూ.

అన్నట్టు “హెడ్ సెట్ తెచ్చుకున్నానా?”... అనుకుని వెంటనే “ఆ.. లేకపోతే ఏదోరకంగా మైయిన్ టైన్ చేద్దాంలే”... ఐదేళ్లు కలిసి బతికిన పెళ్ళాం వెళ్లిపోతేనే మేనేజ్ చెయ్యడంలే... “లైట్ తీసుకో అనుపమ్... ఛిల్” పైకే అనేసేడు. ఇది తనకి అలవాటే. ఒక్కడూ డ్రైవ్ చేస్తున్నపుడు తనతో తనే మాట్లాడుకోవడం.

ఒక్కోసారి విపరీతమైన కోపం వస్తుంది. వర్క్ ఫ్రస్ట్రేషన్ ఒకవైపు. మరోవైపు తనని ఎటిఎం లాగా మాత్రమే చూసే మనుషులు. ఛీ ఛీ.. అవన్నీ తల్చుకోకూడదు. తల్చుకుంటే ఆదుర్దా, గాభరా అన్నీ చుట్టుముడతాయి.

“జెనరేటివ్ ఏఐ యుగమిది. చాట్ జీపీటీ, క్లాడ్ , జెమినీల కాలమిది. మరి కొంతకాలంలో యంత్రం పూర్తిగా మనిషి మీద ఆధారపడకుండా దానిపని అది చేసుకు పోతుందట. ఎంతకాలంలోనో తెలియదు. కానీ మనిషికి సహజమైన భయాందోళనలు తప్పుతాయా? ఇక మీదట ఉద్యోగాలన్నీ ఉంటాయో, ఊడుతాయో!”

అబ్బా.. పొద్దున్నే ఏవిటీ తలనెప్పి ఆలోచనలు, అప్పుడు చూసుకుందాంలే. తల విదిలించాడు.

“అన్నట్లు నిన్ననే ఏఐ ఏజంట్ ఒకటి వచ్చింది, మనం మనతో సంభాషిస్తున్నట్లు వాట్సాప్ లో దానితో సంభాషిస్తూ పనులు చేయించుకోవచ్చు” ఆ రోజు లంచ్ టైంలో కొలీగ్స్ మధ్య సంభాషణ నడుస్తోంది.

“అంటే వంట చెయ్యడం, డిష్ వాషర్ లోడ్ చెయ్యడం వంటివా? వాట్సాప్ లో మెసేజీ పెడితే మా ఆయనే చూడదు” ఎవరో అన్నారు. చుట్టూ నవ్వులు.

“ఇది నిజంగానే సీరియస్ టాపిక్. వాట్సాప్ లో సంభాషించడానికి ముందుగా మన డివైజులు అన్నిటి మీదా అటానమస్ హక్కులు ఏఐ ఏజంట్ కి ఇవ్వాల్సి ఉంటుంది”

“ఇస్తే?” క్యూరియస్ గా అడిగేడు అనుపమ్. అసలే తనకి వచ్చిన ప్రతి టెక్నాలజీని అందరికంటే ముందుగా వాడడమంటే సరదా.

“ఇస్తే, మన డాక్యుమెంట్లన్నీ చక్కగా సర్ది ఫోల్డర్లలో భద్రపరచడం, మన బదులు ఈమెయిళ్ళు పంపడం.. ఇలా ఏదైనా “మన బదులుగా” ఈ ఏఐ ఏజంటే చేసుకుపోతుందన్నమాట.”

ఇంటికి రాగానే ఏఐ ఏజంటుకి అడిగిన అన్ని హక్కులూ ఇచ్చేసాడు. లోకల్ నెట్వర్క్ తో కనెక్షను, లాప్టాపు, ఫోను, ఐపాడు, వాచీ అనీ డివైజులతో అనుసంధానంతో మొదలుపెట్టి వాట్సాప్ లో

యాడ్ చేసుకోవడం వరకు చకచకా చేసేసాడు. అసలే వీకెండ్ వచ్చిందంటే సమయం ఉండదు. ట్రెక్కింగ్ తోనో, మారథాన్ ప్రాక్టీసుతోనో సరిపోతుంది.

ఆ రోజు గౌతమ్ తో కార్ పూల్ లో ఆఫీసుకి వెళుతూ "కిందటి వారమంతా ఏఐ ఏజంటుతో కుస్తీ పడితే లాప్టాప్ లో డెస్క్టాప్ మీద, డాక్యుమెంట్స్ లోను, డౌన్లోడ్స్ లోను, ఎక్కడపడితే అక్కడ చెల్లాచెదురుగా ఉన్న డాక్యుమెంట్లు సర్దడం కూడా ఓ కొలిక్కి రాలేదు. ఇక ఈమెయిళ్ళు పంపడం మాట దేవుడెరుగు. నువ్వు ట్రై చేసావా?" అన్నాడు అనుపమ్.

"నాకేం తొందర లేదు, నీలాంటి ఎక్స్పర్ట్ లు ట్రై చేసాక చూద్దామని ఆగేను. అయినా అదేవిటి? మన వాళ్ళు అంతా ఏఐ ఏజంటే చేసుకు పోతుంది, అదీఇదీ అన్నారుగా" అన్నాడు గౌతమ్.

"అదే మరి. కంపెనీల వాళ్ళు ఎప్పుడో ఫ్యూచర్ లో జరగబోయేవన్నీ ఇప్పుడే అనౌన్స్ చేసేస్తారు. మనలాంటి వాళ్ళు మర్నాడే వాళ్లు చెప్పినవన్నీ జరిగి పోతాయని నమ్మేస్తాం" నిట్టూర్చాడు అనుపమ్.

మళ్ళీ తనే "నిజానికి ఏఐలతో పని చేయించడానికి మనిషితో బోల్డు అవసరం ఉంది కదా. అన్నీ ఇచ్చినా ఈ ఏఐలకి వంద ప్రశ్నలు వస్తాయి. చిన్న పని చేయించడానికి లక్షసార్లు ప్రాంప్ట్ లు ఇవ్వాలి." అన్నాడు చికాగ్గా.

"ఇప్పుడు నిన్ను అంత అర్జెంటుగా ఎవరు వాడమన్నారు అవన్నీ?" చిన్నగా నవ్వేడు గౌతమ్.

"అవన్నీ సరేగానీ జ్యోత్స్న సంగతి చెప్పు. ఏవైనా మెసేజీ చేసిందా?" అన్నాడు మళ్ళీ.

"చేస్తే నీకే మొదట చెపుతానుగా" మరింత చికాగ్గా అన్నాడు అనుపమ్.

"అదికాదురా, నీకెందుకంత పంతం? ఆడవాళ్ళకి సరెండర్ అయిపోతేనే సంసారాలు నిలబడతాయి, నా మాట విను"

"నా వల్ల కాదురా, నేను ఆత్మాభిమానం ఉన్న వ్యక్తిని, ఈ సారీలు, గీరీలు నా వల్ల కావు"

"మరి, ఇక అంతేనా"

"ఏం చెయ్యమంటావు చెప్పు. నీకు కొత్తగా చెప్పేదేవుంది? తను చెప్పినమాట ఏదీ వినదు. 'ఇండిపెండెన్సీ .. తొక్కా.. తోలూ.. అని.' వదిలెయ్యి---నాకు బూతులొస్తాయి, ఆమాట ఎత్తకు"

కార్లోంచి విసురుగా దిగి ఆఫీసులోకి వెళ్ళిపోయాడు.

"ఒరేయ్ ఆగరా.. కారు పార్కుచేసి నేనూ వస్తున్నానుగా" గౌతమ్ మాటలు వినిపించుకునే స్థితిలో లేడు.

"ప్రతివాడూ నాకు చెప్పేవాడే" గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు అనుపమ్.

పనిలోకి వచ్చి పడితే ప్రశాంతత దక్కుతుందనుకుంటే ఇక్కడా ఆడవాళ్ళ పెత్తనమే. కొత్తగా వచ్చిన లేడీ బాసుని చూస్తూ "రానురానూ మనుషుల కన్నా యంత్రాలే నయమనిపిస్తున్నాయి." అనుకున్నాడు.

ఇంతలో వాచీలో నోటిఫికేషన్ మోగింది. ఇంటి తలుపు దగ్గిర ఉన్న సెక్యూరిటీ కెమెరాకి సంబంధించిన యాప్ నోటిఫికేషన్ అది. ఇంటి దగ్గిర ఎవరో తలుపు కొడుతున్నట్లున్నారు. రింగ్ యాప్ తెరిచి లైవ్ వీడియో చూడసాగేడు. ఎదురింటి పిల్లాడు.

"అంకుల్, అంకుల్.. నా బాల్.." రింగ్ వీడియో కెమెరాకేసి తిరిగి అరుస్తున్నాడు.

"వీడికివేళ సెలవు కాబోలు. మళ్ళీ గార్డెన్ లోకి బంతి కొట్టినట్లున్నాడు, ఈ సారి ఇచ్చేది లేదు. వీడికిదే శాస్తి". యాప్ మూసేసి పనిలో పడ్డాడు.

రింగ్ బెల్లు మోగి మోగి ఊరుకుంది.

అసలే ఈవేళ సాయంత్రంలోగా పెర్ఫార్మన్స్ రివ్యూ పంపాలి. పొద్దున్నే ఇలా తగలడింది.

చకచకా టైపు కొట్టసాగేడు.

❦❦❦

ఆ రోజు "ఒకసారి మన ఆఫీసు కెఫే లోకి వస్తావా?" గౌతమ్ కి ఆఫీసు స్లాక్ లో మెసేజ్ చేసేడు అనుపమ్.

"అసలీ లేడీ బాసేవిట్రా. ఎంత బాగా పని చేసినా 'లో పెర్ఫార్మెన్స్' అని రాసి పడేసింది రిపోర్టులో అన్నాడు" అనుపమ్ డీలా పడిపోతూ.

"ఉష్.. ఎవరైనా వింటారు. నోర్మూసుకోరా బాబూ! ఇప్పుడున్న ఏఐ బూమ్ పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగాన్ని నిలబెట్టుకోవడమే ఇంపార్టెంటు, మా వింగ్ లో సగం మందికి 'లే ఆఫ్' నోటీసులు వెళ్లాయట ఈ ఉదయం. మన కార్తీక్ పనిచేసే కంపెనీలోనూ వారం నించి లే ఆఫ్ లే నట. చుట్టూ అంతా గగ్గోలుగా ఉంది" అన్నాడు తల విదిలిస్తూ గౌతమ్.

"ఈ ఏఐలు ఇప్పటికిప్పుడు తమంతట తాముగా పనిచెయ్యలేవని కంపెనీలకి తెలియదంటావా? అసలు ఏఐలతో పనిచేయించడానికి మనిషి అవసరం తప్పనిసరిగా ఉంటుంది. వాటంతటవి పూర్తిగా మనిషి సహాయం అవసరం లేకుండా అటానమస్ గా పనిచేసుకుంటూ పోవాలంటే ఎన్నో నెలలు పడుతుంది. ఆల్రెడీ చూసానుగా ఆ అటానమస్ ఏజంటు పనితనం" అని తల విదిలించి

"అసలు ఇప్పటిదాకా సాఫ్ట్వేర్ ఇండస్ట్రీకి ఎప్పుడూ ఇలాంటి గడ్డు పరిస్థితి ఎదురవ్వలేదు. నిజానికి ఏదైనా సాఫ్ట్వేర్ సక్సెస్ అయ్యిందంటే ఉద్యోగాలు పెరుగుతాయని సంబరపడేవాళ్ళం. ఇప్పుడు ఈ ఏఐ బూమ్ అందుకు సరిగ్గా వ్యతిరేకదిశలో పనిచేస్తూ ఉంది" గద్గదంగా అన్నాడు అనుపమ్.

"ఏమోరా. ఈ కార్పొరేటు కంపెనీల లాగానే చాలా మంది ఈ ఏఐ లు కొద్ది వారాల్లోనే స్వయంగా పనిచేసేస్తాయని నమ్ముతూ, తమ ఉద్యోగాలు ఏమవుతాయోనని టెన్షన్ పడుతున్నారు. అయినా అవన్నీ ఉద్యోగుల బాధలు మాత్రమే. కార్పొరేటు కంపెనీలదేముంది? ఎక్కడ కాస్ట్ కటింగ్ అవసరమనిపిస్తే ఆ డిపార్టుమెంట్లు మొత్తం లేపేస్తారు. క్లాడ్ కంపెనీ ఆంత్రోపిక్ ఇలా అనౌన్స్ చేసిందో లేదో అలా స్టాక్ మార్కెట్లు ధనామని కూలబడ్డాయి. కంపెనీల్లో వేటు మొదలయ్యింది" అన్నాడు గౌతమ్.

ఇంటికి వచ్చి నిస్త్రాణగా కూలబడ్డాడు అనుపమ్.

ఒంటరితనం బాగా బాధిస్తోంది.

అక్కడ జ్యోత్స్న అంత కఠినంగా ఎలా ఉండగలుతుంది?

మనుషులక్కూడా యంత్రాల్లా కేవలం పనిచేసే వ్యవస్థ ఒక్కటి మాత్రమే ఉంటే బావుణ్ణు. ఈ దిక్కుమాలిన మనసు ఒకటి తగలడింది. ఎప్పుడూ బాధలు తప్పవు.

❦❦❦

మరో నెలలో లే ఆఫ్ ఈ మెయిల్ వచ్చింది అనుపమ్ కి.

అనుకున్నంతా అయ్యింది. ఇవేవీ శాశ్వతమైన ఉద్యోగాలు కావు. అయినా ఒక్కసారిగా నిస్పృహ ఆవహించింది.

అసలే ఇప్పటికే తన జీవితం అస్తవ్యస్తంగా ఉంది. ఇప్పుడీ కొత్త బాధ మొదలయ్యింది. మళ్ళీ కొత్త ఉద్యోగం వచ్చే వరకూ సమస్యే. కంటిముందర ఇంటి అప్పు మార్టిగేజు, కారు లోన్, క్రెడిట్ కార్డు బిల్లు కనిపించి భయపెట్టసాగేయి.

అదీగాక ఉద్యోగం అంటే డబ్బు మాత్రమే కాదు. పనిలో ఉంటే కొంతలో కొంత ఉన్న బాధల్ని మరిచిపోతూ ఉంటాడు. పని లేకపోతే ప్రపంచంలోని బాధలన్నీ చుట్టుముడతాయి. అదీ పెద్ద బాధ.

మెసేజీ తెరిచాడు. జ్యోత్స్నకి సారీ చెపుదామా! టైపు చెయ్యడం ప్రారంభించాడు --- "హనీ---.."

పెళ్లయిన కొత్త రోజులు గుర్తుకు వచ్చాయి.

" ఇలా నోరు తిరగని పేరు ఎవరైనా పెట్టుకుంటారా? అయినా అదేం పేరు..జ్యో.."

"నాది చాలా మంచి పేరు. జ్యోత్స్న..అంటే వెన్నెల---" కందిన ముఖంతో అంది జ్యోత్స్న.

"సింపుల్ గా వెన్నెల అని పెట్టుకోవచ్చుగా మరి.."

"ఆ---అయితే నా నామకరణానికి మీరొచ్చి చెప్పి ఉండాల్సింది మా అమ్మానాన్నలకి" విసురుగా వెళ్ళిపోతున్న జ్యోత్స్న వెనకే పరుగెత్తుతూ

"ఊ--- బావుందిలే, ఏదో నోరు తిరక్క--- పోనీలే.. "హనీ" అని పిలుస్తాను ముద్దుగా"

------

------

అంతలోనే జ్ఞాపకాలు బాధించడం మొదలుపెట్టేసరికి అనుపమ్ ఫోను మూసేసాడు.

"అయినా నేనెందుకు సారీ చెప్పాలి? మాట వినాల్సింది తను. ఉన్న ఊళ్ళో కాకుండా, ఇంకో ఊళ్ళో ఉద్యోగం ఎందుకు? ఉద్యోగం మానెయ్యమంటే అంత కోపమా? తననే ముందుగా మెసేజీ చెయ్యనీ."

మొండిగా అనుకున్నాడు.

ఉదయం లేచిన దగ్గరనించి ఉద్యోగాలకి అప్లికేషన్లు పెట్టడం, కాల్స్ కోసం ఎదురుచూడడంతో సరిపోతూ ఉంది. ఒక్క ఇంటర్వ్యూకి కూడా కాల్ రావడం లేదు.

ఆ ఉదయం లేవగానే బెల్లు మోగింది.

అబ్బా--- ఈ పక్కింటి పిల్లాడికి వేళా పాళా లేదు.

తిట్టుకుంటూ వచ్చాడు అనుపమ్.

"మీ టీవీ అమ్ముతామ"ని ప్రకటన ఇచ్చారు కదా!

ఎవరో పెద్దావిడ ఇటాలియన్ యాసలో ఇంగ్లీషు మాట్లాడుతూ ఉంది.

"నేనా? ఎప్పుడు?" సాలోచనగా అన్నాడు గెడ్డం గోక్కుంటూ.

"ఇదిగో.. ఇది మీరిచ్చిన ప్రకటనేగా"

అందులోని అడ్రసుతో సహా చూపిస్తూ అంది.

"అడ్రసు కరెక్టే, కానీ ఎక్కడో పొరబాటు జరిగింది క్షమించండి".

"హు, అనవసరంగా ఇంత దూరం వచ్చాను. ఇలాంటి యాడ్ లు ఇవ్వడం ఎందుకు? తెలియదని చెప్పడం ఎందుకు" తలుపు మూతబడినా రింగ్ కెమెరా, మైక్రోఫోన్లో మాటలు వినబడతాయని తెలియక గొణుగుతూ వెనుతిరిగింది ఆవిడ.

ఆన్ లైనులో ఆవిడ చెప్పిన చోట ఉన్న ప్రకటననే తదేకంగా చూస్తూ ఉండిపోయాడు.

తనైతే గారంటీగా ఇటువంటి ప్రకటన ఇవ్వలేదు. ఎవరు తన బదులుగా ప్రకటన ఇచ్చారు? తన బదులుగా– "తన" బదులుగా–

ఓ మై గాడ్ ... తను తన పాత లాప్టాపులో ఇన్స్టాల్ చేసుకుని మరిచిపోయిన ఏఐ ఏజంటా? కొంపదీసి అది తనకు తానుగా అటానమస్ గా పనిచేస్తూందా?

అయినా అది టీవీ అమ్మకానికి పెట్టడం ఏవిటి?

అంటే అది... అటానమస్ గా పని చెయ్యడంలో భాగంగా తన ఈ మెయిల్స్, మెసేజెస్ అన్నీ చదువుతోందా? సంభాషణలన్నిటికీ రిప్లైలు తనంతట తనే ఇచ్చేస్తూ ఉందా?

ముందురోజు రాత్రి తను గౌతమ్ కి చేసిన మెసేజ్ గుర్తుకు వచ్చింది.

"గౌతమ్! క్రెడిట్ కార్డు బిల్లు కట్టాల్సి ఉంది. కాష్ అవసరం. ఏవైనా సర్దగలవా? షేర్ మార్కెట్ డౌన్ లో ఉంది కదా. త్వరలో మార్కెట్ కోలుకోగానే ఇచ్చేస్తాను"

చకచకా మెసేజెస్ అన్నీ చెక్ చేసుకున్నాడు.

తను అనుకున్నది నిజమే, ఏజంటు యాక్టివ్ గా మెయిల్స్ కి, మెసేజెస్ కి రిప్లైలు ఇచ్చేస్తూ ఉంది.

జ్యోత్స్న నించి మెసేజ్ పైనే కనబడింది.

"నువ్వు నన్ను క్షమించమని అడగడం ఏవిటి? తప్పు నాదే. నిజానికి నేను నిన్ను క్షమించమని అడగాలి. నిద్ర లేవంగానే కాల్ చెయ్యి"

తన కళ్ళని తను నమ్మలేకపోయాడు. పట్టరాని సంతోషం వేసింది. జ్యోత్స్నేనా ఈ మెసేజ్ చేసింది?

అయినా తను జ్యోత్స్నని క్షమించమని అడగడం ఏవిటి?

సంభాషణలో అంతకు ముందు ఉన్న మెసేజ్ చూడగానే మతిపోయింది.

నిజమే, తనే "సారీ" చెప్పాడు.

అంటే ఈ ఏఐ ఏజంటు తను "హనీ.." అని ఎప్పుడో మొదలుపెట్టి వదిలేసిన మెసేజీని పూర్తి చేసి పంపించేసిందన్నమాట.

పోనీలే. మంచి పనే చేసింది.

మనిషికున్న ఈగో యంత్రానికి లేనందుకు సంతోషించాలి.

జ్యోత్స్నకి కాల్ చెయ్యాలి. వెంటనే టిక్కెట్టు బుక్ చేసుకోవాలి. తనకి ఇష్టమైన వాల్ ఆర్ట్ ని సర్ ప్రైసింగ్ గా పట్టుకెళ్ళాలి.

ఉత్సాహంగా ఫోను చేసాడు. ఎంగేజ్ రాసాగింది.

ఇంతలో టీవీ యాడ్ ఇచ్చిన సైటులోకి వెళ్లి చూసేడు. ఇంకేమైనా అమ్మకానికి పెట్టేసిందా కొంపదీసి?

కంగారుగా చూడసాగేడు.

వరసగా తన పేరుతో పొలోమని యాడ్స్ కనిపించసాగేయి.

జ్యోత్స్నకి ప్రాణమైన అత్యంత ఖరీదైన వాల్ ఆర్ట్, ఇటాలియన్ ఫ్రిడ్జ్, టెస్లా కారు, ఇల్లు వరసపెట్టి అన్నీ అమ్మకానికి ఉన్నాయి.

అంటే ఏఐ ఏజెంటు తన మెసేజీల్లో "కాష్ అవసరం" అనే పదాన్ని పట్టుకుని, పైగా అకౌంట్లలో డబ్బులు లేకపోయేసరికి ఇక తనంతట తను నిర్ధారించుకుని ఇవన్నీ అటానమస్ గా అమ్మకానికి పెట్టేసిందన్నమాట.

వావ్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్... జీవితాల్ని మార్చేస్తున్నాయన్నమాట.

జ్యోత్స్నకి మెసేజ్ చేసి సయోధ్య కుదర్చడం వరకు బానే ఉంది. కానీ ఇలా అన్నీ అమ్మకానికి పెట్టెయ్యడం ఏవిటి అర్థం లేకుండా.

తన మిస్డ్ కాల్ చూసుకుంది కాబోలు. జ్యోత్స్న నించి ఫోను రాసాగింది.

ఆనందంగా ఫోనందుకున్నాడు.

"హనీ..." అన్నాడు వణుకుతున్న గొంతుతో.

"చేసిందల్లా చేసి 'హనీ' అని తేనెలొలికిస్తున్నావా?" అట్నుంచి కఠినంగా వినిపించింది.

"నేనేం చేసాను?" బుకాయింపుగా అన్నాడు. కొంపదీసి క్షమించమని అడిగినది తను కాదని తెలిసిపోయిందా?

అట్నుంచి జ్యోత్స్న గట్టిగా అరిచింది "నువ్వెప్పటికీ మారవన్నమాట. క్షమించమని మెసేజీ వస్తే ఏదో మారావనుకున్నాను."

"ఆగాగు, ఎందుకలా మాట్లాడుతున్నావు, అసలేమైంది?" అన్నాడు ఇంకా ఏమీ తెలియనట్లు.

"ఏమైందా? నాతో సంప్రదించకుండానే ఇల్లు అమ్మకానికి పెట్టేస్తావా? చివరికి నా వాల్ ఆర్ట్ కూడా వదల్లేదు" కోపంతో రంకెలు వెయ్యసాగింది.

"అదా సంగతి, అయినా ఏం జరిగిందంటే..."

"ఇంకేం చెప్పకు"

"అదికాదు హనీ నేను చెప్పే మాట విను..." అనుపమ్ ఏదో చెప్పేలోగానే

"ఛీ, నువ్వూ, నీ మేల్ ఈగో, ఇక ఈ జన్మలో నీ ముఖం నాకు చూపించకు" విసురుగా ఫోను పెట్టేసింది జ్యోత్స్న.

*****